# సింగిల్ పేజీ కథలు

# కర్కోటకుడు

''మా బాస్‌తో బాధలు పడలేకపోతున్నారా! పరమ కర్కోటకుడు. నరరూప రాక్షసుడనుకో. ఎంత జాగ్రత్తగా పనిచేసినా ఎక్కడో అక్కడ తప్పులు వెతుకుతూ ఉంటాడు. పరమ ఛండాలంగా తిట్టి స్టాఫ్ అందరి ముందూ పరువు తీస్తాడు. అవమాన పరుస్తాడు. మా ఆఫీసులో చాలా మందితో అతని తీరు అదే అయినా, నా మీద కొంచెం ఎక్కువ. ఎందుకంటే ఆయన అల్లుడికి రావల్సిన ప్రమోషన్ నాకు వచ్చినందుకు. అతని బారి నుండి ఎలా తప్పించుకోవాలో నాకు అర్థం కావడం లేదు'' తలపట్టుకు కూర్చున్నాడు రామారావు తన గోడు నాకు వినిపించి.

జాలిగా చూశాను వాడి వైపు. కొద్దిగా ఆలోచించి అన్నాను.

''అవునూ! నీకో యూనియన్ ఉంటుందిగా! అక్కడ చెప్తే నీ సమస్య పరిష్కారం కావచ్చు. మీ యూనియన్ సెక్రటరీ లాంటి వాళ్లు కలుగజేసుకుంటే పరిస్థితి చక్కబడొచ్చు.''

''థాంక్స్‌రా! మంచి సలహా ఇచ్చావు. నాకు ఇంతవరకూ ఈ ఆలోచనే తట్టలేదు. అందుకేరా నీ దగ్గరికి వచ్చేది! నువ్వయితే మంచి సలహా ఇస్తావు. అంతేకాక నీకు చెప్తే నా బాధ సగం తగ్గినట్లుంటుంది'' అన్నాడు.


రామారావు నా చిన్ననాటి స్నేహితుడూ, క్లాస్‌మేటూనూ. ఇద్దరం కలిసి చదువుకొని ఈ ఊళ్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డాం. ఇద్దరి ఉద్యోగాలు వేరు వేరైనా, మేమిద్దరం ప్రతి ఆదివారం, సెలవు రోజుల్లో కలిసి గడుపుతాం. చిన్ననాటి విషయాలు, పాత సంఘటనలు నెమరువేసుకుంటాం.

రామారావు పై ఆఫీసరు రామారావుని ప్రతి చిన్న విషయానికి కక్ష సాధిస్తాడు. తను పడుతున్న అవస్థలు గురించి ఏకరువు పెడ్తాడు. రామారావు నాతో కలిసినప్పుడల్లా వాడి పై ఆఫీసర్ ఓ శాడిస్ట్. వాడి బాధలు విని నాకు రామారావుపై చాలా జాలి కలిగింది. అవసరమైనప్పుడు సెలవివ్వడు సరికదా ఆరోజు ఇంకొంచెం ఎక్కువ పని ఇచ్చి పూర్తి చేసి వెళ్లమంటాడు. ప్రతి చిన్న విషయానికి రాద్ధాంతం చేసి మెమోలిస్తాడు. తన అల్లుడికి రావల్సిన ప్రమోషన్ వాడికి వచ్చిందని అంత కక్ష వాడి మీద.

ఓ వారం తర్వాత కలిసినప్పుడు రామారావు మరీ డల్‌గా కనిపించాడు.

నన్ను చూస్తూనే తన బాధంతా వెళ్లగక్కేడు.

''నువ్వన్నట్లే మా యూనియన్ సెక్రటరీకి చెప్పాను. ఆ తర్వాత నా పొట్టు ఇంక చెప్పడానికి లేదు. నేను తనపై యూనియన్‌కి కంప్లైంట్ చేసినందుకు నా మీద మండి పడ్డాడు. నన్ను పిలిచి చీవాట్లు పెట్టడమే కాకుండా డిసిప్లినరీ ఏక్షన్ కింద సస్పెండ్ కూడా చేయగలనని బెదిరించాడు. మొత్తానికి నేను చెప్పలేదని ఇంకెవరైనా చెప్పి ఉంటారని, బ్రతిమాలి మెల్లగా బ్రతికిపోయాను. అయితే



సస్పెండ్ చేయలేడనుకో ఎందుకంటే అలా చేస్తే యూనియన్ ఊరుకోదుగా! అయినా సరే, ఇంకే విధంగానైనా నా మీద కక్ష తీర్చుకోవచ్చు'' అన్నాడు దిగులుగా.

''అవునూ! అతనికి నీ మీద అంత ద్వేషం అయినప్పుడు, నీకెక్కడికయినా ట్రాన్స్‌ఫర్ చెయ్యొచ్చు కదా!'' సాలోచనగా అన్నాను.

''ఇక్కడుండి వాడి చేత బాధలు పడేకన్నా ఏ శంకరగిరి మాన్యాలకి ట్రాన్స్‌ఫర్ చేసినా బతికిపోతాను. అయితే అలాగే చేసేటట్లయితే ఎప్పుడో ఆ పని చేసేవాడు. నేను కూడా హాయిగా బ్రతికిపోయేవాణ్ని. వాడు ఉత్త శాడిస్ట్. ఇక్కడే ఉంచి అనుక్షణం నన్ను వేధించడం ధ్యేయంగా పెట్టుకున్నాడు మరి!'' అన్నాడు రామారావు.

నేను కొద్దిగా ఆలోచించి అన్నాను-

''నాకొక ఐడియా తట్టింది. నాకు బాబాయ్ వరసైన రామనాథం గారు మీ హెడ్డాఫీసులో పర్సనల్ సెక్షన్‌లో పనిచేస్తున్నారు. ఈమధ్యనే ట్రాన్స్‌ఫరై వచ్చారతను. అతనితో చెప్తే నీ ట్రాన్స్‌ఫర్ విషయమై ఏమైనా సహాయం చేయవచ్చు.''

''బాబ్బాబూ! కొంచెం అతనికి చెప్పి పుణ్యం కట్టుకో! ఇక్కడికి దగ్గర్లో ఉన్న బ్రాంచైనా పర్వాలేదు. దూరమైనా పర్వాలేదు. ఏ కొండల్లో కోనల్లో ఉన్న బ్రాంచ్ అయినా నాకేం అభ్యంతరం లేదు. ముందు ఇక్కణ్నించి బయట పడి వీడి బారి నుంచి దూరంగా పోతే అంతే చాలు!'' అన్నాడు.

''మా బాబాయ్ ఈ ఆదివారం మా ఇంటికి తన సొంత పని మీద వస్తున్నాడు. నువ్వు ఆ రోజు మా ఇంటికి రా! అతనితో వివరంగా చెప్పి మన ప్రయత్నం మనం చేద్దాం! అతను చాలా మంచి వాడు. తప్పకుండా నీ పని జరగవచ్చు'' అన్నాను నేను.

మరుసటి ఆదివారం రామారావుని మా బాబాయ్‌కి పరిచయం చేసి అతని సమస్య వివరించాను. రామారావు బాస్ గురించి అతనికూడా బాగా తెలుసు. మా అభ్యర్థన మేర తప్పకుండా ప్రయత్నించి, ఇంకెక్కడికైనా ట్రాన్స్‌ఫర్ చేయిస్తానని మాట ఇచ్చారతను.

అతను భరోసా ఇచ్చినట్లుగానే ఓ నెల రోజుల్లో రామారావుకి పక్క జిల్లాలో గల బ్రాంచ్‌కి బదిలీ అయింది. ఆ రోజు చాలా సంతోషంగా ఉన్నాడు వాడు. నన్ను హోటల్‌కి తీసుకెళ్లి స్వీట్స్, టిఫిన్ పెట్టించి సినిమాకు కూడా తీసుకెళ్లాడు. మా బాబాయ్‌కి తన కృతజ్ఞతలు తెలియజేయమని మరీ మరీ చెప్పాడు.

తర్వాత ఆ ఆర్నెలల వరకూ రామారావుతో మరి భేటీ జరుగలేదు. రామారావు ట్రాన్స్‌ఫరయిన పది రోజుల్లో అక్కడికి ఇల్లు కూడా మార్చాడు. ఈ లోపున ఫోన్‌లోనే గానీ ముఖాముఖి ఇద్దరం కలుసుకోలేదు.

ఫోన్ చేసినప్పుడల్లా నా సహాయం మరువలేనని, ఇప్పటి తన బాస్ చాలా మంచివాడని, మర్యాదస్తుడని, మా బాబాయ్‌కి మరీ మరీ థాంక్స్ చెప్పమనేవాడు. వాడు సంతోషంగా ఉండడం నాకు చాలా ఆనందం కలుగజేసింది.

హఠాత్తుగా ఓరోజు ఉన్నట్లుండి ఊడిపడ్డాడు రామారావు. వస్తూనే రెండు చేతుల్లో తన ముఖం దాచుకొని కుర్చీలో కూలబడ్డాడు. ఏమైంది వాడికి?

వాణ్ని అలా చూస్తూనే-

''ఏంరా! ఏం జరిగింది?'' అన్నాను ఆదు

ర్దాగా.

కొద్దిసేపు వాడేమీ మాట్లాడలేదు.

మెల్లగా తల పైకెత్తాడు. వాడి ముఖం దీనాతిదీనంగా ఉంది.

''నా దురదృష్టంరా అంతా! ఎలాగోలా ఇక్కణ్నుంచి తప్పించుకొని వెళ్లిపోయాను కదా! ఈ ఆర్నెల్లు హాయిగా గడిచిందో లేదో అక్కడ మా ఆఫీసర్‌కి ట్రాన్స్‌ఫరై వెళ్లిపోయాడు'' కొద్దిగా ఆగి టీపాయ్ మీద నున్న మంచినీళ్ల గ్లాసందుకొని గడగడా తాగేశాడు.

''అయితే...''

''మరింకేం లేదు. మా పాత బాస్ కర్కోటకుడు ఇక్కడ్నుంచి ట్రాన్స్‌ఫరై అక్కడ మా బ్రాంచ్‌కి దాపురించాడు. నిన్ననే వచ్చి జాయినయి నన్ను చూసి విషపు నవ్వు నవ్వాడు. ఇంక నన్ను రక్షించే వాడే లేడు. వాడి బారి నుండి తప్పించుకోవడానికి, నేను ట్రాన్స్‌ఫరై వెళ్తే, నా వెనుకే రాహువులా మళ్లీ దాపురించాడు'' అన్నాడు దీనంగా.

వాడి మాటలు విని అవాక్కయ్యాను నేను. ఇలాంటి పరిస్థితి కలుగుతుందని అనుకోలేదు మరి.

**-డి.వి.డి.ప్రసాద్**
**(పదంపూర్, ఒరిస్సా)**

# పాపం కళ్యాణి

"మా అమ్మాయి సత్యవతి" అంటూ రామ్మూర్తి కూతుర్ని పెళ్లికొడుకు మనోహర్‌కు, అతని తల్లిదండ్రులకు పరిచయం చేశాడు. అందరికీ నమస్కారాలు పెట్టిన తరువాత సత్యవతి సోఫాలో కూర్చుంది.

"నువ్వు బాగా పాడతావని మీవాళ్లు చెప్పారు. ఒక పాట పాడమ్మా" అని అడిగింది పెళ్లికొడుకు తల్లి విశాలాక్షి. త్యాగరాజ కృతి పాడింది సత్యవతి. ఆమె గానమాధుర్యానికి అందరూ తన్మయులయ్యారు. విశాలాక్షి మళ్లీ అడిగిన మీదట అన్నమాచార్య కీర్తన, జయదేవుని అష్టపది కూడా పాడి వినిపించింది.

ఇల్లు చూసే నెపంతో పెద్దవాళ్లంతా లోపలకు వెళ్లారు. మనోహర్, సత్యవతి తాము చేస్తున్న ఉద్యోగాల గురించి, హాబీల గురించి మాట్లాడుకున్నారు.

అంతలోనే కళ్యాణి గేటు తీసుకొని సరాసరి హాల్లోకి వచ్చింది.

"నా ఫ్రెండు కళ్యాణి" అని మనోహర్‌కు పరిచయం చేసింది సత్యవతి.

"ఇతను మనోహర్. స్టేట్ బ్యాంకు కోఠి బ్రాంచిలో పనిచేస్తున్నారు" కళ్యాణితో చెప్పింది.

"మీరు జాబ్ చేస్తున్నారా?" అని అడిగాడు మనోహర్.

"లేదు. డిగ్రీ పూర్తి చేసింది. మిస్టర్ రైట్ కోసం చూస్తుంది" అంది సత్యవతి నవ్వుతూ.

"అలాగా! ఆల్ ది బెస్ట్" అన్నాడు మనోహర్ చిరునవ్వుతో.

"థాంక్యూ!" అంది కళ్యాణి మెరిసే కళ్లతో అతని వంక చూస్తూ.

పేరుకు తగ్గట్టు ఎంత అందంగా ఉన్నాడో! సత్యవతి అతనికి నచ్చుతుందా? అనుకుంది కళ్యాణి అనుమానంగా. పెద్దవాళ్లంతా హాల్లోకి వచ్చారు.

సత్యవతి కంటె చొరవగా మనోహర్‌తో నవ్వుతూ మాట్లాడుతున్న కళ్యాణిని చూసి ముచ్చటపడింది విశాలాక్షి.

"అమ్మాయి బంగారు బొమ్మలాగ ఉంది. మీ అమ్మాయి ఫ్రెండా?" అని అడిగింది సత్యవతి తల్లి వరలక్ష్మిని.

"అవును" అంటూ ముక్తసరిగా జవాబిచ్చింది వరలక్ష్మి. ఫోను చేసి అభిప్రాయం చెప్తామంటూ పెళ్లివారు వెళ్లిపోయారు.

* * *

"కళ్యాణి మన పొరుగున ఉన్నంత కాలం మనమ్మాయికి కళ్యాణం కలసి వచ్చేటట్లు లేదు. మనం చెప్పకపోయినా పెళ్లిచూపుల టైముకు ఠంచనుగా తయారైపోతుంది. వచ్చిన వాళ్లు మనమ్మాయిని చూడటం మానేసి ఆ పిల్లవంక గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోవటం. వెళ్లాక మీ అమ్మాయి నచ్చలేదు కానీ మీ అమ్మాయి ఫ్రెండు నచ్చింది. వాళ్ల ఫోను నెంబరివ్వండి అని అడగటం పరిపాటి



అయిపోయింది. నచ్చలేదని ఆ పెళ్లికొడుకుల్ని తిరస్కరించింది కానీ ఈ అబ్బాయిని కాదనదు. మరొక ఇంటికి మారిపోతే తప్ప పిల్లకు పెళ్లి కుదరదేమో! తనకు సంబంధం కుదరటం లేదన్న ఆందోళనతో ఆవేదనతో తల్లితండ్రితో అంటున్న మాటలు విని నిట్టూర్చింది సత్యవతి. చిన్నప్పటి నుంచి బాగా తెలిసి ఉండడం వలన కళ్యాణి తమ ఇంటికి చనువుగా వేళాపాళా చూడకుండా వస్తూపోతూ ఉంటుంది. కళ్యాణి అందం, చలాకీతనం, చొరవ ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాయి. పెళ్లిచూపులకు వచ్చిన వాళ్లు కళ్యాణిని చూడగానే తనతో మాట్లాడటం మానేసి తనను పట్టించుకోకుండానే వెళ్లిపోయిన సందర్భాలు లేకపోలేదు. పెళ్లిచూపుల టైములో కళ్యాణి లేకుండా ఉంటే బాగుండనుకున్నా. ఇంతవరకు ఆమె రాక పోవడమంటూ జరగలేదు.

"నా పెళ్లి గురించి మీరు బెంగ పెట్టుకోవద్దమ్మా! నాకు మ్యూజిక్ స్కూలులో మంచి ఉద్యోగం ఉంది. అదే నాకు రక్షణ, తోడు. వస్తాను" అంటూ స్కూలుకు వెళ్లిపోయింది సత్యవతి.

* * *

"కళ్యాణిగారూ-

మీరు నా పేర బాంకుకు రాసిన ఉత్తరం అందింది. సత్యవతి ఏవరేజ్ స్టూడెంటని, అందగత్తె కాకపోవటం వల్ల ఎవరూ ఆమెను పట్టించుకునే వారు కాదని, అబ్బాయిలను ఆకర్షించటానికి ప్రయత్నించి నవ్వుల పాలవుతూ ఉండేదని, ఆమెలో ఉన్నవన్నీ మైనస్ పాయింట్లేనని రాశారు. ఎన్నో సంగీత పోటీల్లో ఆమె బహుమతులు గెల్చుకున్నదని, ఆమెకున్న గొప్ప ప్లస్ పాయింట్ ఆమె సంగీతమని మీకు తెలియదా? మీ గురించి నేనామెను అడిగినప్పుడు మీరు చక్కదనం, చలాకీతనం ఉన్న మంచి అమ్మాయని చెప్పింది. ఎదుటివారిలోని మంచిని మాత్రమే చూసే ఆమె సంస్కారం ఆమెకొక ప్లస్‌పాయింటు కాదా?

ఆశలుండటం తప్పుకాదు. వాటిని నెరవేర్చుకోవటానికి ఇంకొకరి వ్యక్తిత్వాన్ని కించపరిచి, వాళ్ల ఆశలను త్రుంచే ప్రయత్నం చెయ్యటం మాత్రం తగదు. మీ వాళ్లు మా వాళ్లను కాంటాక్టు చేస్తారని రాశారు. కానీ ఆ అవసరం లేదు". -మనోహర్.

తిరస్కరించటమే కానీ తిరస్కరింపబడటం ఎరుగని కల్యాణి ఆశాభంగంతో, కోపంతో ఉత్తరాన్ని చింపి ఉండగా చేసి డస్ట్‌బిన్‌లో పడేసింది.

* * *

"మన పెళ్లికి కళ్యాణి రాకపోవటం చాలా వెల్తిగా అనిపించిందండీ! పెళ్లి రెండు రోజులుండనగా అర్జెంటుగా రమ్మన్నారంటూ వాళ్ల మామయ్యగారి ఊరికి వెళ్లిపోయింది" అంది సత్యవతి మనోహర్‌తో.

"మొహం చూపెట్టలేకపోవటానికి తనేం తప్పు చేసిందండీ?" అని అడిగింది సత్యవతి నివ్వెరపోతూ. "ఏం చేసిందంటే..." అంటూ జరిగినదంతా వివరించాడు మనోహర్.

స్నేహితురాలినని కూడా ఆలోచించకుండా స్వార్థంతో తన గురించి చులకనగా రాసి మనోహర్‌ను పొందాలనుకున్నది కళ్యాణి. కాని ఆ ప్రయత్నంలో తనని తనే చులకన చేసుకుంటున్నట్లు గ్రహించలేకపోయింది పాపం కళ్యాణి అనుకుంది సత్యవతి.

**-జి.సరస్వతి (బెంగుళూరు)**